క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): జిల్లా కేంద్రం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు మంగళవారం 31వ రోజు కొనసాగాయి. రిసోర్స్ పర్సన్ జి.శేషారత్నం విద్యార్థులకు సెల్ ఫోన్లు - వాటి దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. వీలైనంత వరకు పుస్తకాలే చదవాలని, గ్రంథాలయాలకు వెళ్లాని, కంప్యూటర్ విజ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ పి.శంకర్ విద్యార్థులకు ×స్వర్ణాంధ్ర - 2047 అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాంపాషా, ఎం కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డీసీఎంఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

ఏలూరు (టూటౌన్): డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన చాగంటి మురళీ కృష్ణ ఈ నెల 4న సాయంత్రం 4 గంటలకు ఏలూరులోని డీసీఎంఎస్ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు డీసీఎంఎస్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేషన్ పంపిణీలో సమస్యలుంటే ఫిర్యాదు చేయాలి

ఏలూరు (టూటౌన్): రేషన్ సరుకుల పంపిణీలో సమస్యలు ఉంటే కమాండ్ కంట్రోల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 18004256453కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ఏలూరు నగరంలోని 23వ డివిజన్ ఫిరంగులదిబ్బలో రేషన్ పంపిణీని మంగళవారం ఆమె పరిశీలించారు. రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించి, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పాకాకు ఘన స్వాగతం

ఏలూరు (టూటౌన్): ఇటీవల ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన పాకా వెంకట సత్యనారాయణ మంగళవారం భీమవరం వెళుతున్న నేపథ్యంలో స్థానిక బీజేపీ నేతలు ఆయన్ని కలపర్రు టోల్‌గేట్ వద్ద కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎస్ఆర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. జూట్ మిల్లు సెంటర్‌లోని పూలే సెంటర్‌లో పాకాకు గౌడ సంఘీయులు అభినందనలు తెలిపారు. జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేశారు. నగర బీసీ నాయకులు వీరంకి త్రినాథరావు, ఏలూరు నగర గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పరసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

జంగారెడ్డిగూడెం: ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి దేశంలోని లౌకిక పార్టీలు కలిసి రావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ నుంచి బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు సమైక్యతా యాత్ర నిర్వహించారు. మత సామరస్యం వర్ధిల్లాలి, ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని నినదించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, బి.బలరాంలు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారని తెలిపారు. ఉగ్రదాడిని ఖండించడంలో ప్రదర్శించిన ఐక్యత, సమైక్యతా స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్క తాటిపై నిలిపిందన్నారు.

నయవంచక పాలన

- కూటమి ప్రభుత్వంలో పేదలకు పాట్లు
- అమలుకాని సూపర్ సిక్స్ హామీలు
- ఉచిత బస్సు ప్రయాణం హుష్ కాకి
- మహిళలకు మొండి చెయ్యి
- ఉసూరుమంటున్న అన్నదాత
- తల్లికి వందనం ఎప్పుడో?
- నిరుద్యోగ భృతి ఊసేలేదు!



బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ పేరుతో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలివీ



నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అంతా దగా, మోసమే అంటూ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15 వేలు తల్లికి వందనం, రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామంటూ ఊదర గొట్టారు. అధికారం చేపట్టి నేటికి ఏడాది కాలం పూర్తయినా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించినా కొద్దిమందికే పరిమితమైంది. మోసపూరిత హామీలతో అందల మెక్కిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు మోసం చేశారంటూ ఏలూరు నియోజకవర్గ ప్రజలు విస్తుపోతున్నారు.

ఒక్క గ్యాస్ సిలిండర్‌కే దిక్కులేదు?

ప్రతి కుటుంబానికీ ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమంటూ అట్టహాసంగా ప్రారంభించిన పథకం సగం మందికే పరిమితమైంది. మిగిలిన వారు గ్యాస్ సిలిండర్ సొమ్ము కోసం ఎదురు చేస్తున్నారు. ఏలూరు నియోజకవర్గంలో 86,516 కుటుంబాలు ఉన్నాయి. వీటిలో 50 వేల వరకు కుటుంబాలు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులు. మొదటి సిలిండర్ సొమ్ము 25 వేలలోపు లబ్ధిదారులకే జమయ్యాయి. ఏడాది పాలనలో ఒక్క సిలిండర్‌కే పరిమితం చేసి మిగిలిన రెండు సిలిండర్‌లకు ఎగనామం పెట్టారు.

అటకెక్కిన ఉచిత బస్సు ప్రయాణం

మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం హామీకి సంబంధించి ఏడాది పూర్తయినా మార్గదర్శకాలు సైతం రూపొందించలేదు. ఎన్నికల ముందు ఉచిత బస్సు సౌకర్యం ఉంటే మహిళలు రూపాయి ఖర్చు లేకుండా పుణ్యక్షేత్రాలు తిరిగి రావచ్చంటూ ఎన్నికల సభల్లో ఊదర కొట్టిన నాయకులు ప్రస్తుతం దాని ఊసే ఎత్తడంలేదు. ఇది మోసం కాదా అంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నెలకు రూ.1500 ఎప్పుడో?

19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందిస్తామని సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్నారు. అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయింది. ఆడ బిడ్డల నిధి ఎప్పుడు ఇస్తారంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తాము వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అమ్మ ఒడి వంటి పథకాలలో పొందిన మొత్తానికన్నా ఎక్కువ మొత్తం అందేలా చూస్తామంటూ నమ్మబలికి తీరా అధికారంలోకి వచ్చాక మొండి చెయ్యి చూపడం బాబు నైజమంటూ మహిళలు మండిపడుతున్నారు.

అందని పెట్టుబడి సాయం

కూటమి ప్రభుత్వ పాలన ఏడాదైనా రైతులకు ఏటా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు హామీ అమలుకు నోచుకోలేదు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న 10 వేల మందికి పైగా రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా పేరుతో ఏటా రూ.13,500 ఆర్థిక సాయం అందించిందని, ఆ సొమ్ము తమకు ఎంతగానో అక్కరకు వచ్చిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.

నిరుద్యోగ భృతి ఊసే లేదు?

తాము అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామంటూ సూపర్‌సిక్స్‌లో మొదటి హామీగా హడావుడి చేశారు. తీరా అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఆ ఊసే ఎత్తకు పోవడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఉద్యోగాలు లేవు, ఉన్న ఉద్యోగాలను ఊడ బీకుతున్నారంటూ వాపోతున్నారు. ఏలూరు నియోజకవర్గంలో దాదాపు 3.50 లక్షల వరకు జనాభా ఉంది. చదుకున్న నిరుద్యోగులు 10 శాతం చొప్పున నియోజకవర్గంలో సుమారు 35 వేల మంది ఉన్నారు. వీరంతా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు.

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు మందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలి. కొన్ని రోజుల్లో పాఠశాలలు, కాలేజీలు పునఃప్రారంభంకానున్నా తల్లికి వందనం పథకంపై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదు.

– పి.కిషోర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు, ఏలూరు

లబ్ధి పొందిన పాలకులు



ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సూపర్ సిక్స్ పేరిట హామీలిచ్చారు. తీరా గెలిచాక వాటి ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు నెలకు రూ.1500 అమలు కావడం లేదు. హామీలను ఇవ్వడం వాటిని తుంగలోకి తొక్కడం పాలకుల నైజంగా మారింది.

– బి.సోమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: ప్రతి విద్యార్థీ తాము ఎంచుకున్న రంగంలో లక్ష్య సాధించేందుకు నిరంతర సాధన పట్టుదల ఉండాలని చాటపర్రు గ్రంథ పాలకులు వాసుకి అన్నారు. బుధవారం చాటపర్రు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. శిక్షణ తరగతులు ముగిసిన తర్వాత అధికారులు ప్రజాప్రతినిధుల చేత షీల్డు, సర్టిఫికెట్లు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వ్యక్తిపై దాడి

ఏలూరు టౌన్: అప్పుగా తీసుకున్న సొమ్ము ఇవ్వాలని ఒక యువకుడిని అడ్డగించి, మోటారు సైకిల్ లాక్కుని, అతడ్ని కిడ్నాప్ చేసి నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. బాధితుడు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేరడంతో వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు. టూటౌన్ సీఐ కె.అశోక కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన జొన్నకూటి అంజనేయులు, ఏలూరుకు చెందిన నాని అనే వ్యక్తి వద్ద రూ. 20 వేలు అప్పు తీసుకుని, ఆ సొమ్ములు ఇవ్వడం లేదని ఆగ్రహించిన నాని అంజనేయులు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అడ్డగించి మోటారు సైకిల్‌తో పాటు అతనిని నిర్మానుష్య ప్రదేశానికి నానితో పాటు మరికొందరు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. నానితో పాటు మరికొందరిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.

స్వచ్ఛ ఏలూరుకు ప్రణాళిక



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఏలూరు (టూటౌన్): నగరాన్ని స్వచ్ఛ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు ముందస్తు ప్రణాళికతో వెళ్తున్నామని, శానిటేషన్ పనులకు ఆటంకం కలగకూడదని ట్రాక్టర్లు కొనుగోలు చేశామని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.54 లక్షలతో కొనుగోలు చేసిన 9 ట్రాక్టర్లను మంగళవారం వారు జండా ఊపి ప్రారంభించారు. వీటిలో 3 ట్రాక్టర్లు మంచినీటి సరఫరాకు, 6 ట్రాక్టర్లు శానిటేషన్ పనులకు ఉపయోగిస్తారని వారు తెలిపారు. ట్రాక్టర్లు తిరగని రోడ్లలో చెత్తను సేకరణకు 25 క్లాప్ వాహనాలను ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు పెదబాబు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఎంఈ సురేంద్ర బాబు, డీఈ రజాక్, ఏఈ సాయి పాల్గొన్నారు.

నేడు ఏలూరులో నిరసన ర్యాలీ

- ఉదయం 9.30 గంటలకు ప్రారంభం
- కూటమి ఏడాది పాలనతో వెన్నుపోటు
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్



పోస్టర్ ఆవిష్కరించిన జయప్రకాష్, పార్టీ నేతలు (ఫైల్)

ఏలూరు టౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా ముంచేసిందని, సూపర్ 6 హామీలను సైతం అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఏలూరులో వెన్నుపోటు దినంగా పాటిస్తూ భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నేటికి ఏడాది గడిచినా హామీలు అమల్లో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల సమన్వయ కర్తలు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్‌తోపాటు, పార్టీ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీలోని నాయకులు, మండల, గ్రామ స్థాయిలోని నాయకులు, కూటమి ప్రభుత్వం చేతిలో మోసపోయిన ప్రజలు, యువత, విద్యార్థులు, మహిళలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు ర్యాలీ

ఏలూరులో బుధవారం ఉదయం 9.30 గంటలకు సీఎస్ఐ చర్చి సమీపంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి భారీ ర్యాలీ ప్రారంభిస్తామని జయప్రకాష్ తెలిపారు. శాంతియుతంగా గన్‌బజార్ నూకాలమ్మ గుడి రోడ్డు, ఈదర సుబ్బమ్మదేవి స్కూల్ మీదుగా ఆర్ఆర్‌పేట మెయిన్ రోడ్డులో నుంచీ ఏలూరు జీజీహెచ్, కోర్టు సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు ర్యాలీ చేరుతుందని, ఎన్ఆర్‌పేట ప్రధాన రహదారి మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్డులో నుంచి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంటుందని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మోసపోయిన ప్రజలు హాజరుకావాలన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న రమేష్ బాబు

ఏలూరు (టూటౌన్): రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ బాబు అన్నారు. మంగళవారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ డ్రైవింగ్ వల్ల జరిగిన ప్రమాదాలను వివరించారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్, కారు తదితర వాహనాలను నడిపేటప్పుడు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరమని తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యపానం చేసి వాహనాలు నడపరాదని అన్నారు. ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వాహన పత్రాలను వాహనంతోపాటుగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాహనచోదకులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రజక వృత్తిదారులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): గ్రామాల్లో రజక వృత్తిదారులు ఐక్యతగా ఉండి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య సూచించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం పలు మండలాల నుంచి వచ్చిన రజకులు వివిధ సమస్యలపై కట్లయ్యతో మాట్లాడారు. 1982లో ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం రజకుల సమస్యలు పరిష్కారానికి కలెక్టర్ అధ్యక్షతన రజక సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయాలని కట్లయ్య అధికారులను కోరారు. రజకులు చెరువులపై అపారమైన లీజులు వేయటం వల్ల, చెరువులు ఆక్రమణలతో ఉన్నందున చాలా బాధలు పడుతున్నారని తెలిపారు. అనేక గ్రామాల్లో చెరువులు పూడికపోయి వృత్తికి పనికిరాని విధంగా తయారయ్యాయన్నారు. శిథిలమైన విశ్రాంతి భవనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ మరమ్మతులకు గతంలో ఒక్కొక్క దానికి రూ.3 లక్షలు, దోబీ ఘాట్‌కి రూ.10 లక్షలు మంజూరు చేస్తూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా కట్లయ్య ఆధ్వర్యంలో రావులపర్రు గ్రామ రజక సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొద్దూరు చిన్న లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా కట్టంగ సత్యనారాయణ, కార్యదర్శిగా ప్రత్తికాయల నాగ దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఓబలంక ఏడుకొండలు, కోశాధికారిగా మురిపాకు పెద్దిరాజు వీరితోపాటు సలహా సభ్యులుగా ఐదుగురిని ఎన్నుకున్నారు.

సుజుకి న్యూ యాక్సెస్ 125 విడుదల



న్యూ యాక్సెస్ 125ను లాంచ్ చేస్తున్న శేషు

ఏలూరు (టూటౌన్): శ్రీ కృష్ణా సుజుకి ఆధ్వర్యంలో హోటల్ ఎన్ ఏలూరులో న్యూ యాక్సెస్ 125 టీఎఫ్‌టీ కలర్డ్ డిస్‌ప్లే వేరియంట్ ద్విచక్ర వాహనాన్ని మంగళవారం విడుదల చేశారు. అధునాతన ఫీచర్లతో దీనిని లాంచ్ చేశారని, దీనికి ఏడేళ్ల ఎక్స్‌టెండెడ్ వారంటీ ఉందని, వంద మంది లక్కీ విన్నర్లతో పాటు గ్యారంటీ రివార్డుగా రూ.5 వేలు అందిస్తున్నామని శ్రీ కృష్ణా గ్రూప్స్ అధినేత నారా శేషు తెలిపారు. కార్యక్రమంలో సుజుకి కంపెనీ సేల్స్ అండ్ సర్వీస్ రీజనల్ మేనేజర్లు శివరామకృష్ణ, సునీల్, ఏరియా సేల్స్ మేనేజర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

వేలేరుపాడు : పోలవరం ముంపులో ఉన్న 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు వెంటనే ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) పోలవరం డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని మెట్టగూడెంలో కుంజా సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన మాస్‌లైన్ సమావేశంలో ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడారు. 41.15 కాంటూరు పరిధిలో ఉన్న పేరంటాలపల్లి, కాకిసనూర్, టేకుపల్లి, కాచారం, టేకూరు, సిద్ధారం, యడవల్లి, చిట్టం రెడ్డిపాలెం, ఎర్రపాడు, బోళ్లపల్లి, కొత్తూరు, తూర్పు మెట్ట గూడెం తదితర 14 గ్రామాలకు వెంటనే ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పడమర మెట్టగూడెం గ్రామాన్ని, 45.72 కాంటూరులో ఉన్న కొర్రాజుల గూడెం, చాగరపల్లి, సుద్దగుంపు, శివకాశిపురం, నాగుల గూడెం, నడిమిగొమ్ముకాలని, వసంతవాడ, మద్దిగట్ల, గుంపెనిగూడెం, పాత పూచిరాల, పూచిరాల కాలనీ తదితర గ్రామాలను 41.15 కాంటూరులో తీసుకొని ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, 41.15 కాంటూరు గ్రామాలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. 45.72 కాంటూరు ముంపు గ్రామాల భూములకు నష్టపరిహారం ఇవ్వాలని, మండలాన్ని యూనిట్‌గా నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే నిర్వాసితులను తరలించాలని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	03
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	07
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	17
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	10
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	21

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆగిరిపల్లి మండలం సీతారాంపురం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ చేసి, దీనికి కారకులైన వారిపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన బుర్ల నాగ పద్మ కోరారు. ఈ మేరకు ఆమె జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో కొంత కాలంగా ఉపాధి హామీ పనుల మస్టర్లలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. కొందరు పనికి రాకపోయినా మస్టర్లలో హాజరు వేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యం చేస్తున్నారని నాగ పద్మ వివరించారు. కొన్నేళ్లుగా ఊరిలో లేని వారికీ హాజరు వేశారని తెలిపారు. దీనివల్ల దాదాపు రూ.లక్ష వరకు అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించినందుకు తమపై ఫీల్డ్ అసిస్టెంట్ సమక్షంలో వారి బంధుగణం భౌతిక దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో గ్రామ సర్పంచ్, ఎఫ్ఏ, ఏపీఎంల పాత్ర ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారం మండల స్థాయి అధికారులకు తెలిసే జరుగుతోందని, దీనిపై ప్రశ్నించినందుకు తన పైనా, తన భర్త నాగరాజుపైనా భౌతికదాడికి పాల్పడ్డారని నాగ పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సాక్ష్యంగా నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో నమోదైన ఎంఎల్‌సీ కేసే నిదర్శనం అని తెలిపారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

కొయ్యలగూడెం: ఎక్సైజ్ శాఖ అధికారుల వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కొయ్యలగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్, వర్తక, వ్యాపార వాణిజ్య సంఘాల సభ్యులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పోలవరం ఎక్సైజ్ శాఖ అధికారులు తమ దుకాణాలలో బెల్లం విక్రయించవద్దంటూ నోటీసులు జారీ చేశారని తెలిపారు. సారా తయారీకి బెల్లం వినియోగిస్తుండడంతో దుకాణాలలోని బెల్లం విక్రయాలు నిలిపివేయాలంటూ ఆదేశించారన్నారు. బెల్లం ఉన్న దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కొనుగోలుదారులలో ఎవరు దేనికి వినియోగిస్తారో తమకు ఏవిధంగా తెలుస్తుందన్నారు. కానీ అధికారులు నాటు సారా పేరు చెప్పి తమను మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఇటువంటి వేధింపుల వలన పొంగుటూరుకు చెందిన ఒక వ్యాపారి దుర్మరణం పాలయ్యాడని తెలిపారు. కూటమి పార్టీలు ఎన్నికలలో ఇదే సమస్యపై తమకు అనుకూలంగా హామీ ఇచ్చారని కానీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.చెల్లన్న దొరకు వినతిపత్రం అందజేశారు. చాంబర్ అధ్యక్షులు మద్దు మోహన్, ప్రధాన కార్యదర్శి గొలిశెట్టి శ్రీను, కంభంపాటి మోహనరావు, నల్లూరి నాగేశ్వరరావు, సరాబు సుబ్బారావు, తిరణాతి లక్ష్మణరావు, అప్పన శ్రీను, ఎస్ శ్రీనివాస్, పి.స్వామి, ఎస్.సుబ్బారావు, పి.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.